తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో రు.150/-లు గెలుచుకున్న రచన

# భావుకతకు భాష్యం

## — అవధానుల విజయలక్ష్మి

"మరో గంటలో పెద్ద వానొచ్చేట్లుంది" దట్టంగా మబ్బులు పట్టిన ఆకాశం వంక చూస్తూ అంది శ్రీమతి.

"చాలా పెద్ద వాన పడితే బాగుంటుంది. దెబ్బతో వేడి తగ్గిపోతుంది" కిటికీలోంచి బయటకు చూస్తూ అన్నాను.

"అవును డాడీ...వానొస్తే ఎంచక్కా డాబా మీదికి వెళ్ళి 'వానా వానా వల్లప్ప' తిరగొచ్చు... చిన్న చిన్న పడవలు చేసి నీళ్లలో వదలొచ్చు!" నాలుగో క్లాసు చదువుతున్న మా ఆఖరుది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంది.

"ఏహే! నీ కెప్పుడూ ఆట గొడవేనే! నాకైతే పెద్ద వాన పడుతున్నప్పుడు ఎంచక్కా మంచంమీద దుప్పటి కప్పుకుని పడుకొని ఏ టార్జాన్ కామిక్కో చదువుకోవాలనుంటుంది" — చెల్లెలి చిన్నతనానికి జాలిపడుతూ అన్నాడు మా రెండోవాడు.

"నాకైతే నీలా ఇంట్లో బద్ధకంగా పడుకోవాలనుండదు. రోడ్డుమీద జంయిమని సైకిలు తొక్కుకుంటూ పోవాలనుంటుంది" తమ్ముణ్ణి వెక్కిరిస్తున్నట్టు చూసి అన్నాడు పెద్దవాడు.

"నీకోయ్?" శ్రీమతి వైపు చూస్తూ అడిగాను.

"వేడి వేడి పకోడీలు తింటూ...ఆవిర్లు కక్కుతున్న టీ తాగుతూ తక్కువ వాల్యూమ్‌లో రేడియో పెట్టుకుని పాటలు వినాలనుంటుంది" చెప్పింది శ్రీమతి.

"మరి మీకెలా వుంటుంది డాడీ?" ఆఖరిదడిగింది కుతూహలంగా.

"ఆ టైములో నాకు మీ అందర్లాగా తిండి మీదా, ఆటలమీదా, పుస్తకాలమీదా ధ్యాసుండదు. ఇవన్నీ ఎప్పుడూ వుండేవే! ఎప్పుడో అరుదుగా కనపడే ప్రకృతిలోని దృశ్యాల్ని ఎంజాయ్ చెయ్యాలన్నదే నా తత్వం. పెద్ద వాన పడుతున్నప్పుడు మొదటి అంతస్థులో అద్దాల కిటికీ పక్కన కూర్చొని భోరున వర్షించే ఆకాశాన్నీ, ఆ వర్షపు జల్లులో తడిసిపోతున్న ప్రకృతినీ అలా చూస్తూ కూర్చోవాలనుంటుంది. అలా చూస్తూ ఎన్ని గంటలు గడిపినా విసుగెయ్యదు!" గర్వంగా చెప్పాను.

కాస్త పెద్ద మాటలు వాడానేమో మా ఆఖరు దానికి అర్థంకాలేదు.

"నాకేమీ అర్థమవలేదు నాన్నా!" అనేసింది.


"నీకు అర్థమవదే తల్లీ...అదే భావుకత అంటే!" అన్నాను.

"భావు...భావుకతా? అంటే?"

"అంటే...అంటే... ప్రకృతి... అంటే నేచర్... అంటే ఈ చెట్లూ, కొండలూ...ఈ ఇళ్ళూ... వీటి మధ్య తిరిగే జంతువులూ, మనుష్యులూ... వీటన్నిటిలోని అందాల్ని చూసి ఆనందించడమన్నమాట!" కాస్త అర్థమైనట్లే చెప్పగలిగానుకున్నాక రిలీఫ్‌గా నిట్టూర్చాను.

"అంటే అర్థమైంది నాన్నా. వర్షం పడుతుంటే ఇవన్నీ నీకు ఎంతో అందంగా కనిపిస్తాయన్న మాట! కిటికీ పక్కన కూర్చుని అవన్నీ చూస్తుంటే నీకెంతో హాయిగా, సరదాగా వుంటుందన్నమాట!"

"వెరీ గుడ్! యు ఆర్ ఎ క్లవర్ బేబీ!" అన్నాను పాపాయి గెడ్డం పట్టుకుని ఊపుతూ.



వర్షం రానే వచ్చేసింది. టప్ టప్‌మని పెద్ద చినుకులతో మొదలై...డాబామీది డ్రెయిన్ పైపు లోంచి నీళ్ళు పెద్ద చప్పుడుతో దబదబా పడేంత పెద్దదయింది.

పాపాయి కాస్సేపు డాబా ఎక్కి 'వానా వానా వల్లప్ప' తిరిగింది కాని, వాళ్ళమ్మ కోప్పడడంతో కింది కొచ్చేసి వరండా పక్కన వున్న చిన్న కాలువలో కాగితం పడవలు వదలడం మొదలెట్టింది.

బయటి కెళ్ళడానికి పెద్దాడికి సైకిలూ, చదువు కోవడానికి రెండో వాడికి కామిక్సూ లేక ఇద్దరూ కేరమ్స్ ఆటలో పడ్డారు.

పకోడీల ప్రయత్నంలో వంటింట్లో ఉల్లి పాయలు తరుగుతూ ముక్కూ మొహం ఏకం చేసేసుకుంటోంది శ్రీమతి.

వాళ్ళంతా జీవంలేని బొమ్మల్లా కనిపించారు నా కళ్ళకి. వాళ్ళమీద జాలీ, నామీద నాకే గౌరవం ఒక్కసారే కలిగాయి.

కిటికీకున్న అద్దాల తలుపులు వేసేసి దగ్గరగా వాలుకుర్చీ లాక్కుని తీరిగ్గా వెనక్కు వాలాను.

ఆకాశంలోంచి రాలిన ఒక్కొక్క చినుకూ కిటికీ అద్దాన్ని టప్‌మని కొట్టుకుని పాములా మెలికలు తిరుగుతూ కిందికి జారులోంది.



# రచయిత్రి స్వపరిచయం

వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌లో ఎక్కౌంటెంట్‌గా పనిచేస్తున్న నాకు వృత్తిమీద ఎంత మక్కువో, ప్రవృత్తి మీద కూడా అంతే. కానీ ఉద్యోగం, ఇల్లు, పిల్లలూ ఈ మూడు బాధ్యతలనూ బాలెన్స్ చేయడంలో నాకిష్టమైన పని 'మంచి పుస్తకాలు చదవడం' తగ్గిపోతోందేమోనని భయ మేస్తుంటుంది ఒక్కొక్కసారి. కొడవటిగంటి, రావకొండ, చలం, రంగనాయకమ్మ, లత, వీళ్ళంతా మారు మూలల్లో నిక్షిప్తమై వున్న భావాల్ని కదిలిస్తే, నాన్నగారు శ్రీ సామవేదుల సీతారామశాస్త్రిగారు, అమ్మ శ్రీమతి వెంకటరత్నం, శ్రీవారు జగన్నాథరావుగారు కదలిన ఆ భావాలను కాగితం మీద పెట్టడానికి ఉత్సాహాన్నిచ్చారు.

ఆంధ్రజ్యోతిలోనే 1986 దీపావళి కథల పోటీలో ఉత్తమ కథ బహుమతి పొందిన నా 'లాన్‌మోవర్' కథ నాకో చక్కని నిజాన్ని చెప్పింది — ఏ మంచి కథైనా తన ప్రభావాన్ని చూపించేది యువతరం మీదనేనని! కొత్తగా తెలిసిన ఆ నిజం నా బాధ్యతను మరింతగా పెంచినట్లు అనిపిస్తోంది.

—అవధానుల విజయలక్ష్మి, నాగపూర్

రోడ్డుమీద నడుస్తున్న మనుష్యుల చేతుల్లో గొడుగులు ఒకదాని తర్వాతొకటి టకటకా తెరుచు కుంటున్నాయి. గొడుగుల్లేని మనుషులూ, కుక్కలూ, ఆవులూ, మేకలూ అన్నీ దుకాణాల అరుగులమీదా, చెట్లకిందా తలదాచుకుంటున్నాయి.

జోరుగా కొడుతున్న జల్లునించి ఆ అరుగులూ, చెట్లూ వాళ్ళని పూర్తిగా రక్షించలేకపోతున్నాయి.

ఘోరున కురుస్తున్న ఆ వర్షంలో...పల్చని నైలాన్ తెర వెనకనుంచి కనబడుతున్నట్టు...మసక మసగ్గా...తమాషాగా వుంది ప్రపంచం. అద్భుతంగానూ వుంది!

అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలి యదు.

ఇంతలో రివ్వున పరిగెత్తుకొచ్చింది పాపాయి.

"నాన్నా...నాన్నా...ఇందాక నువ్వన్నావు చూడు బావు...ఏంటమ్మా అది....బావు....."


"బావు కాదు 'భావు'...భావుకత" సరిచేశాను.

"అదే నాన్నా...ఆ కతంటే నాకసలు ఇష్టం లేదు!" — 'ఈ కూరంటే నాకసలు ఇష్టంలేదు' అన్న విధంగా మొహంపెట్టి అంది.

"ఏం తల్లీ...ఎందుకిష్టం లేదు?" ఆశ్చర్యంగా అడిగాను.

"మరే...అటు చూడు నాన్నా...ఆ వీధ వాళ్ళందరికీ గొడుగుల్లేవుగా? చెట్ల కింద వీళ్ళని ఎలా తడిసిపోతున్నారో! పాపం ఆ అరుగుమీద ఆ కుక్కపిల్ల చూడు నాన్నా ఎలా ఒణికిపోతుందో! అదిగో అక్కడ....దూరంగా నీకు కనబడ్డం లేదూ?...ఆ...అదే....ఆ 'గుడిసెలో' మనుష్యులు చూడు కప్పలోంచి నీళ్ళు అలా కారిపోతుంటే ఎలా ముడుచుకుని కూర్చున్నారో!..మరి...మరి...ఇవన్నీ చూస్తూ కూర్చుని సరదాపడ్డమే...బావు...భావు... భావుకత అన్నావు కదా...అందుకే....అందుకే నా కదంటే ఇష్టంలేదు!"

నిశ్చేష్టుడనై చూస్తూ వుండిపోయాను.



పటివాడ
వెంకట
సుధాకర్

19 11 1958 — 25 6 1979

కనిపించకున్నా
వెన్నెల కురిపించేది
నువ్వే -
మంచు ముత్యాలు
దోసిట పట్టి
నీకై వేచే గడ్డిపూవులం
మేము

మిత్రులు: మచిలీపట్నం